క్లుప్తంగా

నేడు మండల సమావేశం

యడ్లపాడు: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలతాదేవి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిడతల రూన్సీ అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

అథ్లెటిక్స్ మీట్‌లో పతకాలు



నరసరావుపేట రూరల్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో ఎంఏఎం పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజ్ విద్యార్థి పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు సోమవారం తెలిపారు. వర్సిటీలో ఈనెల 13,144 తేదీలలో జరిగిన పోటీలలో కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థి ఎ.సంజయ్ షాట్‌పుట్ విభాగంలో బంగారు పతకం, డిస్క్‌త్రో విభాగంలో వెండిపతకం సాధించినట్లు వివరించారు. పతకాలు సాధించిన సంజయ్‌ను కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరి రావు, ఎంబీఏ విభాగాధిపతి ఎం.సీతార, ఫిజికల్ డైరక్టర్ జె.శంకర్, అధ్యాపకులు అభినందించారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

చిలకలూరిపేట టౌన్: మండలం పరిధిలో ఆధార్ కార్డుల ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు వేలూరు, మురికిపూడి-2 గ్రామ సచివాలయాల్లో, కోమటినేని వారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉంటుందన్నారు. అలాగే పోతవరం, కావూరు గ్రామ సచివాలయాలలో, కుక్కపల్లి వారిపాలెం గ్రామ పంచాయతీ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

వల్లభేశ్వరునికి ఆరుద్రోత్సవం

రొంపిచర్ల: మండలంలోని శివాలయాల్లో ఆరుద్రోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ప్రత్యేక భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు 12 కిలోల కర్పూర జ్యోతి ప్రజ్వలన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం శ్రీ వల్లభేశ్వరస్వామికి మహాన్యాసక పూర్వక రుద్రాభిషేకం, తదుపరి రుద్ర హోమం నిర్వహిస్తారు. ఉదయం 5 గంటలకు మహా మంగళ హారతి ఆశీర్వచనంతో కార్యక్రమం ముగుస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశర్మ తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినుకొండ (నూజెండ్ల): నేరుగా ప్రజా సమస్యలను తెలుసుకొని తక్షణ పరిష్కార చర్యలు చేపట్టేందుకే ప్రజాదర్బార్ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు చీఫ్ విప్ జీవీ హాజరై అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కార దిశగా అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు. ప్రజాసమస్యలు తెలుసుకొని అక్కడిక్కడే పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజాదర్బార్ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, సీఐ శోభన్ బాబు, తహసీల్దార్ సురేష్ నాయక్, టీడీపీ నాయకులు షమీమ్‌ఖాన్, పీవీ సురేష్, సొదగర్ జానీబాషా, అధికారులు పాల్గొన్నారు.

యడ్లపాడులో పోలీసుల ఆకస్మిక తనిఖీ

యడ్లపాడు: మద్యం విక్రయాలు ఎక్కడ పడితే అక్కడ అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వి.బాలకృష్ణ హెచ్చరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా యడ్లపాడు మండలంలోని కొండవీడు, చెంఘీజ్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి అకస్మికంగా పలు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని బడ్డీకొట్లు, టిఫెన్, కిరణా షాపుల్లో మద్యం అమ్మకాలు చేయరాదన్నారు. కేవలం ఎక్సైజ్ అధికారులే కాకుండా పోలీసుశాఖ కూడా మద్యం బెల్టుషాపుల నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

రాకేష్‌కు సాహిత్య పురస్కారం

నరసరావుపేట ఈస్ట్: కర్నూలు జిల్లా మంత్రాలయంలో అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పట్టణానికి చెందిన సాహితీవేత్త గుండాల రాకేష్‌ను సాహిత్య విశిష్ట సేవా పురస్కారం-2024తో సత్కరించారు. మాతృభాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, సంప్రదాయాల అభివృద్ధికి రాకేష్ చేస్తున్న కృషిని అభినందిస్తూ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణం చేతుల మీదుగా పురస్కారం అందించారు. రాకేష్‌ను పట్టణానికి చెందిన పలువురు సాహిత్యాభిమానులు, కళాకారులు అభినందించారు.

అంతటా క్రిస్మస్ జోష్

- ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు
- మార్కెట్‌లో జోరందుకున్న విక్రయ సామగ్రి
- ముస్తాబైన చర్చిలు, ఇళ్లు
- పట్టణాల్లో, మండలాల్లో సెమీక్రిస్మస్
- పేదలకు క్రిస్మస్ కానుకగా దుస్తులు, వస్తువులు పంపిణీ



క్రీస్తు పుట్టుకను తెలిపే పశువుల పాక

యడ్లపాడు: క్రిస్మస్ క్రైస్తవులకు ఘనమైన పండుగ. ప్రపంచ వ్యాప్తంగా ఒకేతేదీ, ఒకే సమయంలో అత్యధికులు చేసుకునే పండుగ క్రిస్మస్. క్రీస్తు జన్మ వృత్తాంతానికి చిహ్నంగా ప్రతి ఏటా డిశంబర్ 25వ తేదీన క్రైస్తవులు, విశ్వాసులు ఎంతో ఘనంగా ఈ పర్వదినాన్ని నిర్వహించుకుంటారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. పర్వదినాన్ని పురస్కరించుకుని ఊరువాడా చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో నెలరోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. క్రైస్తవ ఆరాధికులు సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం. సెమీ క్రిస్మస్ పేరిటా క్రైస్తవయేతరులు సైతం నిర్వహించి మతసామరస్యాన్ని చాటుకుంటారు.

కోలాహలంగా...

సంబరంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలలో క్రైస్తవులు అలంకరణలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. దీంతో క్రైస్తవుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో క్రిస్మస్ అలంకరణల సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. ఒకవైపు ముందస్తుగానే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాన కూడళ్లు, చర్చిల వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు, విద్యుత్‌స్టార్లు అందరినీ ఆకర్షిస్తుండగా, మరోవైపు కొత్త రంగులు, విద్యుత్ కాంతులతో చర్చిలు కళకళలాడుతున్నాయి. ఇక ఇళ్లను అలంకరించుకునే పనిలో క్రైస్తవులు నిమగ్నం కావడంతో జిల్లా అంతటా ఎంతో కోలాహలం మొదలైంది.

షాపుల్లో సందడి..

క్రిస్మస్ పండుగకు నెలరోజులు పాటు సాగే సెమీ క్రిస్మస్ వేడుకలకు వినియోగించే అలంకరణలు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. ఇళ్లు, చర్చిలు అలంకరించడానికి వినియోగించే వస్తువుల విక్రయాలు ఊపందుకోవడంతో మార్కెట్లన్నీ బిజీ బిజీ అయ్యాయి. క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్, కీచైన్స్, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపే వివిధ రకాల వస్తువులు షాపుల్లో కొలువుదీరాయి. అత్యాధునిక, విద్యుత్ సంబంధిత వస్తువులు ప్రత్యేకంగా వినియోగదారుల్ని ఆకర్షిస్తున్నాయి. దీంతో నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలకు మార్కెట్‌లో గిరాకీ ఉంది. నక్షత్రం సైజు, నాణ్యతల ఆధారంగా రూ.100 నుంచి మొదలై రూ.500ల వరకు విక్రయిస్తున్నారు. అలాగే విద్యుత్ కాంతులతో ఉన్న క్రిస్మస్ ట్రీల ధర రూ.500ల వరకు ఉండగా, సాధారణ వాటికి రూ.50 నుంచి రూ.250ల వరకు విక్రయిస్తున్నారు. ఇక బహుమతులు, చాక్లెట్లు, గంటలు, గాజుగోళాలు వంటి వాటిని కొనుగోలు చేస్తుండగా... పిల్లల కోసం ఉపయోగించే శాంతాక్లాజుల ధర రూ.200 నుంచి రూ.1000 వరకు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

బహుమతులుగా దుస్తులు, వస్తువులు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కొందరు క్రైస్తవులు బహుమతులుగా పేదలకు దుస్తులు, పలు రకాల వస్తువులను అందిస్తుంటారు.



చిలకలూరిపేట రాగన్నపాలెంలో ఏర్పాటు చేసిన భారీ స్టార్, క్రిస్మస్‌ట్రీ

ఇప్పటికే కొందరు క్రిస్టియన్లు బహుమతులు, దుస్తులు కొనుగోలు చేసి పేదలకు అందజేస్తున్నారు. వృద్ధాశ్రమాలు, దివ్యాంగులు, అనాథలు ఉండే ఆశ్రమాల్లో వెళ్లి వీటిని పంపిణీ చేస్తున్నారు. క్రిస్మస్ పండుగతో పాటు తమ పెద్దల గుర్తుగా కొందరు నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని కొత్తబట్టలు కూడా కొనుగోలు చేస్తుండడంతో మార్కెట్‌లో పండుగ కోలాహలం నెలకొంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

చిలకలూరిపేట: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ చెప్పారు. సీపీఐ స్థాపించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈ నెల 26వ తేదీన నూరు వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 100 సంవత్సరాల ఉద్యమ పార్టీగా సీపీఐ ఖ్యాతి పొందిందని చెప్పారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి షేక్ సుబాని, చెరుకుపల్లి నిర్మల పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ బిల్లుల్ని వెంటనే తగ్గించాలి

కరెంటు బిల్లుల్ని దహనం చేసిన సీపీఎం నాయకులు



విద్యుత్ బిల్లుల్ని దహనం చేస్తున్న నాయకులు

యడ్లపాడు: కూటమి ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల నాయకులు సోమవారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో విద్యుత్ పెంపునకు నిరసనగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండలశాఖ కార్యదర్శి బందెల పీటర్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు పెంపుదల చేయమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆరునెలల్లోనే ప్రజలపై యూజర్ చార్జీల పేరుతో భారం మోపుతుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోగడ హరిబాబు, నూతలపాటి కాళిదాసు, ఆలోకం సుబ్బారావు, ముత్తవరపు సాంబశివరావు, కల్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం అజయ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఏపీయం వాసుబాబు

శావల్యాపురం: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు జీవనోపాదుల పెంపుదలకు స్త్రీనిధి, ఉన్నతి పథకం ద్వారా మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జి.వాసుబాబు తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా 261 మంది మహిళా సభ్యులకు రూ. 2 కోట్ల 24 లక్షలు రుణాలను ఇచ్చినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలకు ఉన్నతి పథకంలో భాగంగా 36 మందికి రూ. 22 లక్షల 75 వేలు రుణాలను అందజేశామన్నారు. అలాగే పీఎం అజయ్ పథకం ద్వారా ఎస్సీ మహిళలకు 50 శాతం రాయితీపై రుణాలను మంజూరు చేస్తుందన్నారు. ఒక్కో మహిళకు రూ. లక్ష నుంచి 3 లక్షల వరకు 50 శాతం రాయితీపై రుణాలను అందజేస్తుందని ఇందులో భాగంగా వాటాధనం 10 శాతం, ఉన్నతి పథకం ద్వారా 40 శాతం, రుణాలు మంజూరు చేస్తుందని తప్పనిసరిగా యూనిట్స్ ఉండాలన్నారు. అయితే గతంలో రుణాలను సకాలంలో పారదర్శకంగా చెల్లించిన వారికే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఆయనతో పాటు సీసీ ఖాజావలీ ఉన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

ఏపీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ అధికారి మోహన్‌రావు



నాదెండ్లలో మాట్లాడుతున్న మోహనరావు

నాదెండ్ల: గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలని ఏపీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ అధికారి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మోహన్ రావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నాలుగు రోజుల పాటూ జరిగే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలపై శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. గురువారం వరకూ శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ నిర్మల, లక్ష్మీకుమారి, ఏవో హరిప్రసాద్, ఏఈ లు, ఏపీఎం రమేష్ బాబు, వైద్యాధికారి కవితాఅనసూయ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



బొల్లాపల్లిలో పాల్గొన్న మండలస్థాయి అధికారులు, సిబ్బంది

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. పంచాయతీల అభివృద్ధిలో 9 అంశాల లక్ష్యాల స్థానికీకరణలో భాగంగా మండలస్థాయి అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శిక్షకులుగా వైద్యులు వి.సాయితేజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్, శ్రీనివాసరావులు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో మండల స్థాయి అధికారులు, రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్య, ఉద్యాన, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణకుమారి

నరసరావుపేటలో....

నరసరావుపేట రూరల్: గ్రామాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో టీవీ కృష్ణ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణకుమారి, ఈవోపీఆర్‌డీ నాగానంద్, ఎంపీహెచ్ ఈవో కాశీ విశ్వనాధంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 17 సూత్రాలను పాటించినట్టయితే గ్రామాల సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

చిత్రకారుడు డాక్టర్ వజ్రగిరికి సేవా పురస్కారం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వజ్రగిరి జెస్టిస్ వాసవి జ్యోతి సేవా పురస్కారం అందుకున్నారు. వాసవీ విజ్ఞాన జ్యోతి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో నిర్వహించిన సమావేశంలో వాసవీ విజ్ఞాన జ్యోతి సేవా పురస్కారాన్ని జెస్టిస్‌కు అందజేసి సత్కరించారు. 1984 నుండి సత్తెనపల్లిలో దేవాలయాల్లో, గృహాల్లో జెస్టిస్ చిత్రించిన చిత్రాలలోని విశేషాలను, ప్రజ్ఞా పాటవాలను ప్రశంసించారు. పురస్కారాన్ని పొందిన జెస్టిస్‌ను రాజకీయ ప్రముఖులు, లాయర్లు, కవులు, రచయితలు, కళాకారులు, ఉపాధ్యాయులు, పాస్టర్లు అభినందించారు.

ఎవరో ఈ గుర్తుతెలియని మృతుడు?



శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామ సమీపంలో పిట్టంబండ ఎన్నెస్పీ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మేజరు కాల్వలో 28 సంవత్సరాల కల్గియున్న 5 అడుగుల ఎత్తు యువకుడు మృతదేహంపై వంకాయ రంగు చొక్కా, ఆకుపచ్చ ఫ్యాంటు, నలుపు రంగు రంగు కల్గియున్నట్లు తెలిపారు. అలాగే కొంచె గడ్డంతో పాటు తల జుట్టు గుబురుగా ఉందని కుడి చేతిపై అమ్మ అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. గ్రామస్తులు సమాచారం మేరకు వీఆర్వో ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు వివరాలు తెలిసిన వారు శావల్యాపురం ఎస్సై 9440900857, వినుకొండ రూరల్ సీఐ 9440796226 సెల్‌ఫోన్లు నంబర్లు సంప్రదించాలన్నారు.

పాతకోటయ్య స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే చదలవాడ



పాతకోటయ్య స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ పాత కోటయ్య స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం దర్శించుకున్నారు. కొండపై ఉన్న త్రికోటేశ్వర స్వామి ఆలయం నుంచి నడక మార్గంలో పాత కోటయ్య స్వామి ఆలయానికి టీడీపీ నాయకులతో కలిసి చేరుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆరుద్రోత్సవం సందర్భంగా పాత కోటయ్య స్వామి ఆలయం వద్ద నుంచి కల్పించనున్న జ్యోతిదర్శన ఏర్పాట్లును పరిశీలించారు.

కనీస వేతనం అమలు చేయండి

నరసరావుపేట: జిల్లాలో చిరుద్యోగాలు చేస్తున్న వారికి కనీస జీతాలు అమలుచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిను ప్రజాసమస్యల పరిష్కార వేదికలో చిలకలూరిపేట ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఉప్పుటూరి అనీల్‌కుమార్, మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ నస్రూద్దీన్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

పూజల పేరుతో వేధిస్తున్నారు

నరసరావుపేట: పూజల పేరుతో ఇంటి చుట్టుపక్కల వారిని వేధిస్తున్నారని, అదేమని అడిగితే దాడిచేసి కొడుతున్నారని పట్టణంలోని ఇస్లాంపేట మొదటి లైను స్థానికులు జ్ఞానోజీ, రాజా విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించారు. గత నెల 11వ తేదీన మొదటి సారి ఫిర్యాదు చేసినా స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారులు ఎవరూ చర్యలు తీసుకోలేదు అన్నారు. రమావత్ కాశీ అనే మహిళ ఇంటిముందు మున్సిపల్ రోడ్డుపై తులసికోట పెట్టి తదనంతరం దానిని గుడిగా మార్చి రాకపోకలు కూడా సక్రమంగా జరగకుండా చేశారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించామన్నారు.

పొరుగు వారిని ప్రేమించడమే..

నాదెండ్ల: నీ వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనేదే యేసుక్రీస్తు ప్రభువు అందించిన సందేశమని పాస్టర్ దారా అహరోన్ చెప్పారు. గణపవరం అంబేద్కర్ కాలనీలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

టైరు రిటైరైంది!



మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో చెత్త సేకరించే ట్రాక్టర్లు మరమ్మతులకు గురవటంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా మారుతోంది. గ్రామంలో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ మూడు ట్రాక్టర్లతో ప్రతి నిత్యం చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ తంతు ఆదివారం సైతం జరుగుతుంది. గతంలో గ్రామానికి చెందిన తూబాటి సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు కోటేశ్వరరావు, రామారావు, శ్రీనివాసరావులు ట్రాక్టర్‌ను పంచాయతీకి దానం చేశారు. గత నెల రోజులుగా ఈ ట్రాక్టర్ ముందు చక్రాల్లో ఒక టైరు పగిలి మరమ్మతులకు గురైంది. అయితే టైరు మార్చి రిపేరు చేయకుండగనే ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ ముందు భాగం ఒకవైపు పైకి లేవటంతో మూడు చక్రాల పైనే ట్రాక్టర్‌ను నడుపుతున్నారు. వాహనాలను నామమాత్రపు మరమ్మతులు చేయకుండానే వినియోగిస్తే పూర్తిగా పాడయ్యే అవకాశం లేకపోలేదు. ట్రాక్టర్లు మరమ్మతులకు గురైనా, డీజిల్ లేకున్నా చెత్త సేకరణకు ట్రాక్టర్లు రావటం లేదని, దీంతో చెత్తకుప్పలు పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. –నాదెండ్ల

ఘనంగా ఆరంభమైన ధనుర్మాసం



ప్రత్యేక అలంకరణలో రొంపిచర్లలోని సీతారామ స్వామి

నాదెండ్ల: మండలంలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. గణపవరం గ్రామంలో నూతనంగా రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారులు డి.అనిల్‌కుమార్, ఉమా మహేశ్వరశర్మలు స్వామి వారిని అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు గోత్ర నామ పూజల్లో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సంక్రాంతి ముగిసే వరకూ ధనుర్మాస పూజలు ప్రతినిత్యం ఉదయం ప్రారంభమౌతాయని పూజారులు తెలిపారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని విష్ణు ఆలయాలలో ధనుర్మాస పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. సూర్య భగవానుడు ధనుస్సు రాశిలో ప్రవేశించి మకర సంక్రాంతి వరకు ఉండే సమయాన్ని ధనుర్మాసం అంటారు. శ్రీ మహా విష్ణువుకు ఎంతో ప్రీతిపాత్రమైన ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవలు చేస్తారు.

స్వామిని మేల్కొల్పుతూ భక్తులు తెల్లవారుజామునే నగర సంకీర్తన నిర్వహిస్తారు. ధనుర్మాసంలో విష్ణు మూర్తిని ఎంత ఆరాధిస్తారో స్వామి కరుణా కటాక్షాలు అంతగా తమపై ఉంటాయని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా విష్ణు ఆలయాల్లోని దేవతా మూర్తులు ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు.

సాఫ్ట్‌స్కిల్స్‌లో నైపుణ్యత ఉంటేనే ఉద్యోగాలు



మాట్లాడుతున్న డాక్టర్ జగన్నాధరావు

నరసరావుపేట రూరల్: నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ సాధనకు విషయ పరిజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ ఎంతో ప్రముఖ పాత్ర పోషిస్తాయని బెంగుళూరుకు చెందిన స్కిల్, విల్ డెవలప్మెంట్ ఎల్ఎల్‌పీ ఫౌండర్ డాక్టర్ జగన్నాధరావు తెలిపారు. కళాశాలలో విల్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై సోమ వారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ మెటీవేషన్ స్పీకర్ డాక్టర్ జగన్నాదరరావు పాల్గొని స్కిల్స్ డవలప్మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దృఢ సంకల్పంతో ముందడుగు వేయాలని తెలిపారు.

లద్దె పురుగుని నిర్మూలించండి

నరసరావుపేట రూరల్: మొక్కజొన్న సాగుచేస్తున్న రైతులు పొగాకు లద్దె పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏడీఏ పి.మస్తానమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు పత్తి పంటను తొలగించిన అనంతరం మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. మొక్కజొన్న విత్తనాలు నాటిన వెంటనే పొగాకు లద్దె పురుగు నివారణ చేపట్టాలని సూచించారు.

ప్రారంభమైన శంకర భాష్య పారాయణం



శోభాయాత్రలో పాల్గొన్న స్వామీజీలు, మహిళలు

నరసరావుపేట ఈస్ట్: శ్రీ శృంగేరి శంకరమఠంలో శ్రీ శంకర భాష్య పారాయణాంజలి నమామి శంకరం కార్యక్రమం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ నెల 16వ తేదీ నుంచి 29 వరకు నమామి శంకరం, శ్రీభారతీ తీర్థ మహాస్వామి వారి 50వ సన్యాస స్వీకార మహోత్సవం, మహా సన్నిధానం వారి 75వ వర్ధంతోత్సవం (జన్మదినోత్సవం) కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం కోట సెంటర్ నుంచి దాదాపు 60 మంది వివిధ పీఠాధిపతులు శోభాయాత్రగా శంకరమఠంకు తరలివచ్చారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు అభిషేకాలు, నవావరణ సహిత శ్రీచక్రార్చన, మధ్యాహ్నం 3.30 గంటల వరకు శంకర భాష్య పారాయణం, సాయంత్రం భగవద్గీత-శంకర భాష్యంపై ప్రవచనం, శ్రీ శంకరాచార్యపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.